
సాక్షి
పల్నాడు
మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



శరవేగంగా ఆలయ నిర్మాణం

చెరుకుపల్లి: ఆరుంబాక గ్రామంలోని నెల్లెమ్మ తల్లి ఆలయాన్ని సుమారు రూ.1.25 కోట్లతో పునర్నిర్మాణం చేస్తున్నారు. ఫిబ్రవరి 7న ఆలయ ప్రతిష్ట చేస్తారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 584.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 8,298 క్యూసెక్కులు విడుదలవుతోంది.

జలపాలేశ్వరుడికి పూజలు



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వర స్వామికి సోమవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ నియామకం

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌గా స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ, గౌరవ సభ్యుడిగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, సభ్యులుగా బిజినెస్ సోషల్ వర్కర్ జవ్వాజి రామ్మోహన్‌రావు, సోషల్ వర్కర్ పీఆర్వో సిరిగి మణికంఠ, సోషల్ వర్కర్ ఆర్‌ఎంపీ మారెం వీరాంజనేయులు (స్వామి), సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి, మెంబర్ కన్వీనర్‌గా ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, మెంబర్లుగా అర్బన్ మహిళ సెక్రటరీ ఎలినేడి లక్ష్మీతులసి, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ పోట్ల అరుణకుమారితోపాటు ఏపీఎంఎస్ ఐడీసీ ఈఈ, మున్సిపల్ కమిషనర్, అడిషనల్ డీఎంహెచ్‌ఓలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పాపం పసివాడు

మహిళా ప్రాంగణంలో వదిలేసి వెళ్లిన అగంతకులు



లక్ష్మీపురం: జిల్లా కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మహిళా ప్రాంగణంలో రెండు సంవత్సరాల వయస్సున్న బాలుడిని వదిలి వెళ్లిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహిళా ప్రాంగణంలో రెండు సంవత్సరాల బాలుడిని గుర్తు తెలియని యువకులు వదిలి వెళ్లారు. బాలుడిని గమనించిన ప్రాంగణం నిర్వాహకులు నగరంపాలెం పోలీసులకు అప్పగించారు. వారు బాలుడితో మాట్లాడేందుకు ప్రయత్నించినా మాట్లాడ లేదు. బిత్తర చూపులు చూస్తున్నాడు. బాలుడు గురించి ఆచూకీ తెలిసిన వారు నగరంపాలెం పోలీస్ స్టేషన్ 0863- 2234047 లేదా నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ 8688831336 నంబర్లకు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.


బీఎస్సీ అగ్రి కమ్యూనిటీ సైన్స్ ఎన్‌ఆర్‌ఐ కోటా స్పాట్ అడ్మిషన్స్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ అగ్రికల్చర్(హాన్స్) కమ్యూనిటీ సైన్స్ ఎన్‌ఆర్‌ఐ కోటాలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామచంద్రరావు సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆఫీస్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ లాంఫాం నందు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తారని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

14, 15 తేదీల్లో జాతీయ ఎస్సీ కమిషన్ సమావేశాలు

గుంటూరు మెడికల్: విజయవాడలో ఈనెల 14, 15 తేదీల్లో ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి దర్శనపు శ్రీనివాస్ సోమవారం తెలిపారు. తొలిరోజు విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ, రెండో రోజు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భవనంలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, అతిథులుగా సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్ ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు, ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ పరశురామ్, రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య హాజరవుతారని వెల్లడించారు. రెండు రోజుల పాటు జరిగే సమావేశంలో వేదిక హక్కుల, ఆశయాలు గురించి వివరిస్తారని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ, తీర్మానం చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు.

48,006 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 48,006 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 43,998 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది.

అభాగ్యులపై కొరడా

ఝుళిపించన్

- పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల ఎంపిక
- ప్రత్యేక బృందాలతో ఇంటింటి పరిశీలన
- ఆరు పాయింట్లతో విచారణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే ఏడు వేల పింఛన్ల కోత
- తాజా పరిణామాలతో ఆందోళన చెందుతున్న పెన్షనర్లు

పరిశీలన పేరిట దుష్టకూటమి కుతంత్రం



పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ మండలం కంభంపాడులో చర్మకారుల పింఛన్లను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ మండల ప్రత్యేకాధికారి గబ్రూనాయక్, ఎంపీడీఓలు ఫణికుమార్, సరోజినీదేవి, ప్రసాద్ తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ చేబ్రోలు: పండుటాకులపై ప్రతాపం చూపించడానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. పింఛన్ల కోత మొదలెట్టింది. వెరిఫికేషన్ పేరుతో తొలగించే ప్రయత్నాలు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఐదు నెలల్లో జిల్లావ్యాప్తంగా 6,798 పింఛన్లు వివిధ పేర్లతో తొలగించారు. తాజాగా పైలెట్ వెరిఫికేషన్ పేరుతో ప్రతి జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో తనిఖీ చేశారు. పింఛన్‌దారుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ మరోసారి వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ వివరాలు సేకరించారు.

వివరాలను కూపీ లాగుతున్న అధికారులు

ప్రభుత్వం సేకరిస్తున్న వివరాలు గమనిస్తే పూర్తిగా పింఛన్లు కోత విధించడంపైనే దృష్టి పెట్టినట్లు ఉందని అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. పింఛన్ దారులకు ఎంత సాగు భూమి ఉంది, అందులో మాగాణి ఎంత ? మెట్ట ఎంత ఉందనే వివరాలు సేకరిస్తున్నారు. పింఛన్‌దారుడు గతంలో ఏ పని చేసేవాడు.. ప్రభుత్వ ఉద్యోగమా? ప్రైవేటు ఉద్యోగమా? అనే వివరాలతో పాటు వారికి ప్రతి నెలా కరెంట్ బిల్లు ఎంత వస్తోంది పరిశీలిస్తున్నారు. ఇంట్లో ఉన్న విద్యుత్ పరికరాల తనిఖీతో పాటు ఆస్తి వివరాలను రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు చేస్తున్న పని, నెలకు ఎంత ఆదాయం వస్తుందనే వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఇంట్లో వారికి ఉన్న ఆటోలు, కార్లు , లబ్ధిదారుని పేరుతో ఏం ఉన్నాయనేది పరిశీలిస్తున్నారు.

16 ప్రత్యేక బృందాలతో జల్లెడ

చేబ్రోలు మండలం వేజండ్ల-2 గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం పింఛన్ వెరిఫికేషన్‌ను జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద మొదలు పెట్టారు. వేజండ్ల-2 సచివాలయం పరిధిలో 650 మంది లబ్ధిదారులు ఉన్నారు. పరిశీలనకు గాను తెనాలి డివిజన్ పరిధిలోని ఈవోపీఆర్డీలు, ఏవోలు, ఎంఈవోలు, సచివాలయ సిబ్బందితో 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఒక్కో బృందానికి ఇద్దరు సభ్యుల చొప్పున పరిశీలన చేపట్టారు. లబ్ధిదారుల నుంచి వివిధ అంశాలను యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఫొటోలను సేకరించారు. వెరిఫికేషన్ ప్రక్రియను



డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.విజయలక్ష్మి, తెనాలి డీఎల్‌పీవో శ్రీదేవి పర్యవేక్షించారు. గ్రామంలో ప్రత్యేక బృందాలు ఇంటింటికీ తిరిగి వివరాలను నమోదు చేసుకుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు.

కంభంపాడులో పెన్షన్.. టెన్షన్



కంభంపాడులో వృద్ధురాలి పింఛన్‌ను పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

మాచర్ల రూరల్: పింఛన్ల తొలగింపునకు పల్నాడు జిల్లాలో మాచర్ల మండలం కంభంపాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంచుకుంది. దీంతో మండల, జిల్లాస్థాయి అధికారులంతా కంభపాడుకు తరలివచ్చి ఇంటింటినీ సందర్శించి పింఛన్లు తనిఖీ చేస్తున్నారు. లబ్ధిదారుల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. సోమవారం జిల్లా అధికారులు బాలునాయక్, గబ్రూనాయక్, ఎంపీడీఓలు ఫణికుమార్ నాయక్, సరోజనీదేవి, ప్రసాద్‌తోపాటు ఇతర శాఖల అధికారుల నేతృత్వంలో పింఛన్ పత్రాల పరిశీలన చేపట్టారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, ముఖ్యంగా చర్మకారులు, డప్పు, జానపద కళాకారులు, డయాలసిస్ బాధితుల్లో గుబులు మొదలైంది. గ్రామంలో అన్ని రకాల పింఛన్లు కలిపి 505 ఉన్నాయి. వీటిల్లో ఎన్ని కోతకు గురవుతాయోనని లబ్ధిదారులు భయపడుతున్నారు. అవ్వాతాతలైతే మరీ బెంబేలెత్తిపోతున్నారు. తమకు పింఛనే ఆధారమని తొలగించవద్దని అధికారుల కాళ్లావేళ్లా పడుతున్నారు. అధికారులు వారి ఆవేదనను పట్టించుకోకుండా పూర్తిగా పత్రాలు పరిశీలించి చెబుతామంటూ నిర్దాక్షిణ్యంగా సమాధానమిస్తున్నారు. గత ఆరు నెలల్లో కొత్త పింఛన్ ఒక్కటీ మంజూరు చేయని సర్కారు ఇప్పుడు తొలగింపునకు పూనుకోవడంతో లబ్ధిదారుల్లోనూ, ప్రజల్లోనూ ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి సన్నాహాలు

అచ్చంపేట: మండల సరిహద్దులోని మాదిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వరకు కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023లో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నేతృత్వంలో కార్యాచరణ చేపట్టింది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి కావలసిన రూ.65 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసి క్రోసూరులో 2023 జూన్ 12న వర్చువల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గుర్తించిన స్థలం వద్దే, మంజూరైన అవే నిధులతో పనులను కొనసాగించే ప్రక్రియలో ప్రస్తుతం అధికారులు నిమగ్నమయ్యారు. కృష్ణానదిలో 14 పిల్లర్స్ వేసి వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు కావలసి 13.35 ఎకరాల భూమిని సేకరించారు. పల్నాడు జిల్లా మాదిపాడు వైపు 4.45 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాలవైపు 9 ఎకరాల భూమిని సేకరించారు. ప్రస్తుతం మాదిపాడు వైపు సేకరించిన భూమిని చదును చేసే పనులలో ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖాధికారులు, కాంట్రాక్టర్ కసరత్తు ప్రారంభించారు. మరో వారం, పది రోజులలో భూమి పూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.



మాదిపాడు కృష్ణా నది వద్ద ఘాట్‌రోడ్డు నిర్మాణానికి హద్దులు నిర్ణయానికి పాతిన జెండా

హత్యాయత్నం కేసు రాజీ పడలేదని వేధిస్తున్నారు

- పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదులు
- ఎస్టీ కులస్తుడిననే నాపై వేధింపుల పర్వం
- న్యాయం చేయాలంటున్న భట్లూరు వైఎస్సార్ సీపీ నేత శివయ్య



పోట్లూరి శివయ్య

సత్తెనపల్లి: తనపై జరిగిన హత్యాయత్నం కేసులో రాజీ పడలేదని వేధిస్తున్నారని భట్లూరు వైఎస్సార్ సీపీ నేత, ఆర్‌ఎంపీ వైద్యుడు పోట్లూరి శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో వైఎస్సార్ సీపీ తరఫున భట్లూరు ఎంపీటీసీగా పోటీ చేశానని, అప్పటి నుంచి వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతూ భట్లూరులో తమ ఎస్టీ వర్గం ఓటింగ్ వైఎస్సార్ సీపీకి వేయించానని టీడీపీకి చెందిన ఓసీ సామాజిక వర్గం వారు తనపై కక్ష పెంచుకున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూన్ 11న అర్ధరాత్రి గ్రామానికి చెందిన ముగ్గురు ఓసీ సామాజిక వర్గం వారు తన ఇంటి గేటు పగలగొట్టి లోపలికి వచ్చి కత్తితో పొడిచి హత్యాయత్నం చేశారని, ఇది సీసీటీవీలో కూడా నమోదైందని, తన అదృష్టం బాగుండి ప్రాణాలతో బయటపడ్డానని పేర్కొన్నారు. అప్పట్లో పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికా గర్గ్ దగ్గరకు వెళ్లి వివరించడంతో ఆమె ఆదేశాలతో సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు పెట్టి నిందితులను రిమాండ్‌కు పంపారని వెల్లడించారు. ఆ కేసును వెనక్కి తీసుకోవాలని టీడీపీ నేతలు తనను పదే పదే అడిగారని, తాను అంగీకరించకపోవడంతో కక్ష పెంచుకొని తనపై తప్పుడు కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ వర్గం కావడంతో తనను వేధిస్తున్నారని, తన వర్గంవారికి మద్యం పోయించి తమ ఇంటి మీదకు గొడవలకు పంపి మా వాళ్ళ చేత కేసులు పెట్టిస్తున్నారని ఆందోళన చెందారు. తాను రూ. 2 లక్షలు తీసుకున్నానని ఓసీ సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి తనపై కేసు పెట్టారని, ఈ క్రమంలో స్టేషన్‌కు రావాలంటూ సత్తెనపల్లి రూరల్ పోలీసులు పదేపదే ఫోన్లు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. వీటన్నింటిపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలి

- గ్రీవెన్స్‌కు 51 వినతులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్



కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌లో సమస్యలు వింటున్న కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు వచ్చే ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ సూరజ్ గనోరే, ఇతర అధికారులతో కలిసి పీజీఆర్‌ఎస్‌కు అధ్యక్షత వహించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 51 మంది నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో జిల్లాలోని నలుమూలల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని చెప్పారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఉద్బోధించారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో మురళి, డీపీవో ఎంవీ భాస్కరరెడ్డి, డీఎఫ్‌ఓ కృష్ణప్రియ కూడా అర్జీలు స్వీకరించారు.

అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయండి

కలెక్టరేట్, కార్యాలయ సమీపంలోని 200 పడకల ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చే వారిని పరిగణనలోకి తీసుకుని అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలి. దీనికి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు కూడా సమ్మతించారు. దీని వలన పేదలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– గంగుల పెద్దిరెడ్డి, లింగంగుంట్ల గ్రామ టీడీపీ నాయకుడు

రీసర్వేలో ఎకరం పొలం కనిపించటంలేదు

నేను రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో 2012లో ఒక ఎకరం పొలం కొన్నాను. 2015లో పాస్‌బుక్‌లు ఇచ్చారు. ఆ పొలంపై బ్యాంకు నుంచి ఇప్పటికి నాలుగుసార్లు రుణం తీసుకున్నా. నాకు తెలియకుండా రీసర్వే చేశారు. ఆ సర్వేలో పొలం కన్పించటంలేదు. గత నెలలో ఫిర్యాదుచేశా. తహసీల్దార్ పిలిపించారు. ఆ పొలం విలువ రూ.20 లక్షలు ఉంటుంది. నా పొలం నాకు ఆన్‌లైన్‌లో చూపించండి.

– శివలింగ సాయిబాబు, ఇసప్పాలెం, నరసరావుపేట మండలం

మరణ వేదన

- ప్రమాదాలకు నిలయంగా అద్దంకి నార్కట్‌పల్లి రోడ్డు
- బెంబేలెత్తుతున్న వాహనదారులు, పాదచారులు
- నకరికల్లుతోపాటు పలుచోట్ల డేంజర్ స్పాట్లు



అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతం

నకరికల్లు: అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ దారిలో పలుచోట్ల డేంజర్ స్పాట్లు అందరినీ భయపెడుతున్నాయి. తరచూ ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతుండడంతో ఎంతోమంది క్షతగాత్రులవుతున్నారు. నకరికల్లు మండలంలోని త్రిపురాపురం నుంచి అడ్డరోడ్డు గ్రామాల మధ్యన 10 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించి ఉంది. చెన్నై-హైదరాబాద్ మధ్య ఉన్న రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నకరికల్లులో పాత టీవీఎస్ షోరూం నుంచి వై జంక్షన్ వరకు ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. దీనిపై భారీ వాహనాలు, దూరప్రాంతాలకు వెళ్లే వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారికి రెండువైపులా గ్రామం విస్తరించి ఉంది. రోడ్డుకు ఒకవైపు నుంచి మరోవైపునకు వెళ్లేందుకు అండర్ పాస్‌ను సెంటర్‌కు దూరంగా ఏర్పాటు చేశారు. అండర్‌పాస్ ద్వారా నడిచి వెళ్లేందుకు దూరంకావడంతో పాదచారులు బ్రిడ్జి ఎక్కి రోడ్డు దాటుతుంటారు. ఈ క్రమంలోనే పిడుగురాళ్ల, నరసరావుపేట వైపు వెళ్లేందుకు బస్టాప్‌లకు వెళ్లేవారు, బ్యాంకులు, పోస్టాఫీసు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారు రహదారిపై నడుచుకుంటూ దాటి వెళ్తున్నారు. అలాగే ప్రధానసెంటర్‌లో మలుపు కూడా ప్రమాదకరంగా మారింది. ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ, జీబ్రాలైన్స్ గానీ ఏర్పాటు చేయలేదు. దీంతో అతివేగంగా వచ్చే వాహనాలతో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెలలో కనీసం 10కిపైగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు ఈ దారిలో జరిగిన ప్రమాదాల్లో 15 మందికి పైగా మరణించారు. క్షతగాత్రుల సంఖ్య వందకుపైగానే ఉంది.



పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఫుట్ ఓవర్ బ్రిడ్జితోనే ప్రమాదాల నివారణ

నకరికల్లులోని ప్రధాన సెంటర్‌లోని మలుపు వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై పాతూరు వెళ్లే రోడ్డును, బ్యాంకు బజార్‌రోడ్డును కలిపేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తే రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు సాగించే పాదచారులకు ఉపయోగకరంగా ఉంటుంది. దీనివల్ల ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పలువురు ప్రజాసంఘాల నాయకులూ పలుమార్లు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించడం లేదు.

ప్రమాదాలు ఇలా..

- అక్టోబర్ 18న నర్సింగపాడుకు చెందిన పి.సుబ్బయ్య మోటార్‌సైకిల్ ఢీకొని మృతి చెందాడు.
- గత నెలలో అడ్డరోడ్డులోని బాలాజీ డెయిరీ వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మరణించాడు.
- నరసరావుపేట బస్టాప్ వద్ద రామకృష్ణ అనే వ్యక్తి గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు.
- ఆదివారం పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి వద్ద కారు అదుపు తప్పిన ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు.

జిల్లాలో వందశాతం చెత్త విభజన జరగాలి

కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావుపేట: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో వందశాతం చెత్త విభజన జరగాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్, ఆహార, కెమికల్, నిర్మాణ రంగ వ్యర్థాలను ఎక్కడికక్కడ వేరు చేసి సేకరించాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా పర్యావరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ప్రణాళికకు ఆమోదం తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025 మే 31 నాటికి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి వద్దే చెత్త సేకరణ జరగాలన్నారు. 2025 అక్టోబరు 31 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో నాన్ రీసైక్లబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం శానిటరీ లాండ్ ఫిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో నిర్మాణ రంగ వ్యర్థాల సేకరణ, నిర్వహణ కోసం డిపాజిటరీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ, నదీ జలాల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గుంటూరు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతీయ శాఖ ఈఈ నజీనా బేగం మొహమ్మద్, జిల్లా పరిశ్రమల అధికారి సుధాకర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

స్కిల్ హబ్‌లను సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట: జిల్లాలోని నిరుద్యోగ యువత ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏ.పి.ఎస్.ఎస్.డి.సి) ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన స్కిల్‌హబ్‌లలో అందుబాటులో ఉన్న కోర్సుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, నైపుణ్యాధికారి తమ్మాజీరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పట్టుబడిన 40 బస్తాల రేషన్ బియ్యం



నాదెండ్ల: పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై జి.పుల్లారావు కథనం మేరకు తూబాడు గ్రామానికి చెందిన రఘు అక్రమంగా సేకరించిన రేషన్ బియ్యాన్ని 50 కేజీల బరువైన 40 బస్తాలను (10 క్వింటాళ్లు) ఆటోలో ఫిరంగిపురం తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి ఆటో, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రఘును అరెస్టు చేశారు.

కుట్లు వేయడంపై వైద్య విద్యార్థులకు వర్క్‌షాప్



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థులకు, జూనియర్ వైద్యులకు ఆపరేషన్ల అనంతరం కుట్లు వేసే విధానంపై (సూచరింగ్ టెక్నిక్స్) వర్క్‌షాప్ నిర్వహించారు. జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ యతికాన్ సూచరింగ్ టెక్నిక్స్ పేరుతో నిర్వహించిన వర్క్ షాప్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ వైద్య విద్యార్థులకు పొట్టకు, కాలికి, చేతికి, ముఖంపై కుట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన టెక్నిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వైద్య విద్యార్థులు నేర్చుకునేందుకు ఏసీ బస్సులో పది వర్కింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారని, నాలుగు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్క్‌షాప్ జరుగుతుందని చెప్పారు. నాలెడ్జ్ ఆన్ వీల్ నినాదంతో బస్సులో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ల్యాప్రోస్కోపిక్ సర్జరీ సమయంలో ఏవిధంగా కుట్లు వేయాలనే విషయాలను వైద్య విద్యార్థులకు వివరిస్తారని చెప్పారు. పీజీ వైద్యులతోపాటు, జూనియర్ వైద్యులు కూడా సూచరింగ్ టెక్నిక్స్ నేర్చుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని వారు కోరారు.



ట్రోఫీని అందుకుంటున్న చీరాల సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు



జేఎన్‌టీయూకే పురుషుల వాలీబాల్ జట్టు

విజేత చీరాల సెయింట్ ఆన్స్ కళాశాల

- ముగిసిన జేఎన్‌టీయూకే సెంట్రల్‌జోన్ వాలీబాల్ పోటీలు
- రన్నరప్‌గా ప్రగతి కళాశాల (సూరంపాలెం)
- వర్సిటీ వాలీబాల్ జట్టు ఎంపిక

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూకే సెంట్రల్‌జోన్ అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీల విజేతగా చీరాల సెయింట్ ఆన్స్ నిలిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీలో ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల (సూరంపాలెం) జట్టుపై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. రెండు రోజుల పాటు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సెంట్రల్‌జోన్ వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీలలో జేఎన్‌టీయూకే పరిధిలోని ఐదు జిల్లాల నుంచి 38 జట్లు పాల్గొన్నాయి. సోమవారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. కాకినాడ జిల్లా సూరంపాలెంకు చెందిన ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, చీరాల సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల, విజయవాడ పీవీపీఎస్ఐటీ కళాశాల జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా సాగిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో సూరంపాలెంకు చెందిన రెండు కళాశాలల జట్లు తలపడగా ఆదిత్య కళాశాలపై ప్రగతి కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్ చేరింది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో చీరాల సెయింట్ ఆన్స్ జట్టు విజయవాడ పీవీపీఎస్ఐటీ కళాశాల జట్టుపై సునాయసంగా విజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్ పోటీలో విజయం సాధించడం ద్వారా సెంట్రల్‌జోన్ పోటీలలో చీరాల సెయింట్ ఆన్స్ జట్టు హ్యాట్రిక్ గెలుపు అందుకుంది.

బహుమతి ప్రదానోత్సవం

అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ బోర్డు కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్ కుమార్, జేఎన్‌టీయూకే ఐసీటీ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు, ఎన్ఈసీ కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు. విజేత సెయింట్ ఆన్స్ కళాశాల జట్టుకు విన్నర్స్ ట్రోఫీ, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలకు రన్నరప్ ట్రోఫీని అందజేశారు. అలాగే తృతీయ బహుమతిని పీవీపీఎస్ఐటి కళాశాల జట్టుకు, నాలుగో బహుమతిని ఆదిత్య కళాశాల జట్టుకు అతిథులు అందించారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను వర్సిటీ పురుషుల వాలీబాల్ జట్టుకు ఎంపిక చేశారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఎ.రామ చంద్రరాజు, కె.వెంకట్రావు వ్యవహరించారు. కార్యక్రమంలో ఎన్ఈసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్కు కృష్ణారెడ్డి, వ్యాయామ అధ్యాపకులు ఆంజనేయులు, విజయ కుమార్ పాల్గొన్నారు.

వర్సిటీ జట్టు సభ్యులు వీరే..

సిహెచ్.వంశీకృష్ణ(పీవీపీఎస్ఐటి, విజయవాడ), ఎం.వెంకటేష్ (ఎన్ఈసీ నరసరావుపేట), డిరాజమౌళి(కేకేఆర్అండ్‌కేఎస్ఆర్, గుంటూరు), వి.నూకరాజు(యూసీఈకే కాకినాడ), వి.మోహనరావు (యూసీఈఎన్, నరసరావుపేట), ఆర్.వరుణ్‌సందేశ్(ఆదిత్య కళాశాల, సూరంపాలెం), జి.తేజ(సెయింటాన్స్ కళాశాల,చీరాల), డి.అవినాష్(ప్రగతి కళాశాల, సూరంపాలెం), ఆర్.రమణ(సెయింటాన్స్ కళాశాల, చీరాల), కె.నవీన్(విజ్ఞాన్ లారా కళాశాల, గుంటూరు)ఎం.శామ్యూల్(ఎంఐసీ, కంచికచర్ల), డి.బుజ్జిబాబు(ప్రగతి కళాశాల, సూరంపాలెం) జట్టు సభ్యులుగా ఎంపికయ్యారు. మరో ఐదుగురు స్టాండ్‌బైగా ఎంపికయ్యారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

- ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశం
- పోలీస్ గ్రీవెన్స్‌లో 78 అర్జీల స్వీకరణ



బాధితుల సమస్య వింటున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదులపై తక్షణం చర్యలు చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 78 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

నాకు ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించడంతో నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన మొగిలి కోటేశ్వరరావు మధ్యవర్తిత్వంగా కుంభ వెంకట కోటయ్యకు రూ.4.5 లక్షలు ఇచ్చా. ఉద్యోగం ఇప్పించకుండా, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఆ డబ్బులు ఇప్పించి నాకు న్యాయం చేయండి.

– మేడా భాగ్యలక్ష్మి, సిరిపురం గ్రామం, మేడికొండూరు మండలం

రూ.10లక్షలు కాజేశారు

నేను డిగ్రీ పూర్తిచేసి ఇంట్లో ఖాళీగా ఉండగా చిలకలూరిపేటకు చెందిన భూక్య శివశంకర నాయక్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవటంతో డబ్బులు ఇవ్వాలని అడగగా మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండని బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకొని నాకు డబ్బులు తిరిగి ఇప్పించండి.

– భూక్యబాలఆంజనేయులు, సంద్రతండా, అచ్చంపేట మండలం

భర్త జబ్బు దాచిపెట్టి పెళ్లి చేశారు

నా భర్తకు స్కిజో ఫ్రేనియా అనే వ్యాధి ఉందని దాచిపెట్టి అత్తమామలు నాతో పెళ్లి చేశారు. మాకు బాబు పుట్టిన తరువాత భర్త మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడు. మూడేళ్ల వయస్సు ఉన్న నా కొడుకును నాకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. వారిపై చర్యలు తీసుకొని నా బాబును నాకు అప్పగించండి.

– ఓ వివాహిత, వేల్పూరు, శావల్యాపురం

చిట్టీ డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నారు

నేను నా మేనమామ పల్లా నాయుడుబాబు, మరో వ్యక్తి చల్లా శ్రీనివాసరావు నిర్వహించే ధనలక్ష్మి చిట్ ఫండ్‌లో రూ.15 లక్షలు చిట్టీ వేసి పాట పాడాను. వారు సగం డబ్బులు మాత్రమే ఇచ్చి మిగిలినవి అడుగుతుంటే కొడతామని బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని నా డబ్బులు ఇప్పించండి.

– ఓ మహిళ, బరంపేట, నరసరావుపేట

ములకలూరు వక్ఫ్ బోర్డు భూముల వేలంపాటను నిలిపివేయండి

కలెక్టర్‌కు విన్నవించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ములకలూరు రైతులతో కలెక్టరేట్‌కు వచ్చిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మండలంలోని ములకలూరు గ్రామంలోని 13 ఎకరాల వక్ఫ్ బోర్డు భూములు సేద్యం చేసుకునేందుకు వేలంపాట నిర్వహించి ఆ భూమిని చేజిక్కించుకొని అందులోని విలువైన మట్టిని కాజేయాలని చూస్తున్న టీడీపీ నాయకుల యత్నాలను వెంటనే అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ మేరకు ప్రస్తుతం సాగుచేసుకుంటున్న మైనార్టీ రైతులు 40 మంది, ఎంఐఎం నాయకులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.అరుణ్‌బాబును గోపిరెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడారు. నరసరావుపేట మండలం ములకలూరు గ్రామంలో పీర్ల మాన్యానికి సంబంధించిన 13 ఎకరాల వక్ఫ్ బోర్డు ఆధీనంలోని భూమిని గత 70–80ఏళ్ల నుంచి అక్కడ మైనార్టీ రైతులు ఒక్కొక్కరు 30 సెంట్లు, 40 సెంట్లు చొప్పున సాగు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆ భూమిపై అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి కన్ను పడిందని, ఆక్రమించేందుకు వక్ఫ్ బోర్డు అధికారులపై ఒత్తిడి తెచ్చి వేలం వేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయించారని విమర్శించారు. ఆ భూమిలో మట్టి తవ్వుకునేందుకు టీడీపీ నేతలు ప్రణాళిక రచించారని వివరించారు. రైతులకు న్యాయం జరిగేటట్టు చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారని గోపిరెడ్డి వివరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడిచేసిన వారిని అరెస్టు చేసి శిక్షించండి

చిలకలూరిపేట రోడ్డులోని చీకటిగలకాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అన్నపురెడ్డి మంగయ్యపై నాలుగు రోజుల క్రితం దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని గోపిరెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం బాధితుడి బంధువులతో కలిసి ఎస్పీ కంచి శ్రీనివాసరావును గోపిరెడ్డి కలిసి జరిగిన ఘోరం గురించి వివరించి న్యాయం చేయాలని కోరారు.

వక్ఫ్‌భూములకు బోర్డులు ఏర్పాటు చేయండి

గుంటగార్లపాడు, రావిపాడు గ్రామం పరిధిలో ఉన్న వక్ఫ్ బోర్డు పీర్లమాన్యం భూములను సంరక్షించి బోర్డులు ఏర్పాటుచేయాలని ఎంఐఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఏకా మురళీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు షేక్ కరిముల్లా, మౌలాలీలు ఆరీఫ్ పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



ఐలవరం దళితవాడలో రహదారి నిర్మాణం పనుల్లో భాగంగా విచ్చేసిన పోలీస్, మండల అధికారులు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం దళితవాడలో సోమవారం పోలీస్ బందోబస్తు, మండల అధికార యంత్రాంగం సమక్షంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక దళితవాడలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న కమ్యూనిటీ స్థలంలో కొంత మంది వ్యక్తుల కోసం రహదారి ఏర్పాటు చేయడంపై 2016 నుంచి స్థానిక సంఘం ఆక్షేపణ వ్యక్తం చేస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఆ స్థలంలో రహదారి నిర్మాణానికి 2021లో తీర్మానం చేసింది. దీనిపై సంబంధిత వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు సోమవారం మండల యంత్రాంగం, పోలీస్ అధికారులు ఐలవరం విచ్చేసి రహదారి నిర్మాణానికి జరుగుతున్న కీ వాల్ పనులను చేయించారు. తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్ వెంకటరమణ, వేమూరు సీఐ పి.వీరాంజనేయులు, కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు ఎస్ఐలు ఏడుకొండలు, రవికృష్ణ, ఎం.శివయ్య, పంచాయతీరాజ్ ఏఈ శేతు రామచంద్రరరావు, కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, వీఆర్వో లక్ష్మి, వివిధ శాఖల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కమ్యూనిటీ స్థలంలో అందరికి అనుకూలంగా ఉండే భవనం కానీ, పిల్లల ఆటలాడుకునేందుకు ప్లే గ్రౌండ్ కానీ వేయకుండా రోడ్డు వేయడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు రహదారి నిర్మాణం పనులు చేయించేందుకు విచ్చేసినట్లు అధికారులు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహనతోనే నియంత్రణ

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- 'సైబర్ వేలార్' లఘు చిత్ర పోటీల పోస్టర్ల ఆవిష్కరణ
- మోసాలు కట్టడి చేసేందుకు వీడియోలకు ఆహ్వానం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్. చిత్రంలో శిక్షణ ఐపీఎస్ అధికారి దీక్ష, ఏఎస్పీలు రమణమూర్తి, సుప్రజ, హనుమంతు తదితరులు

నగరంపాలెం: సైబర్ నేరాల అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సైబర్ వేలార్ అనే లఘు చిత్ర పోటీల పోస్టర్లను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో సైబర్ నేరాలపై ప్రతి సబ్ డివిజన్‌లో లఘుచిత్రాల వీడియో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆరు సబ్ డివిజన్లకు సంబంధించి మూడు వీడియోలను ఎంపిక చేసి, విజేతలకు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు అందిస్తామని చెప్పారు. సైబర్ నేరాలు పాల్పడేందుకు అవకాశాలు.. వాటికి గురికాకుండా ఉండడం.. బాధితుల కోసం చేపట్టాల్సిన చర్యలపై లఘు చిత్రాలు ఉండాలని తెలిపారు. జిల్లాలోని విద్యా సంస్థల్లో ఇంటర్ లేదా డిగ్రీ లేదా పీజీ చదివే వారు అర్హులని చెప్పారు. ఒక్కో లఘు చిత్రంలో ఆరు లేదా ఏడుగురు ఉండాలని, నిడివి కనిష్టంగా ఐదు నిమిషాలు, గరిష్టంగా ఎనిమిది నిమిషాలని సూచించారు. వీడియోలు తెలుగు లేదా ఇంగ్లిష్ భాషల్లో రూపొందించి, ఈనెల 20లోగా సబ్ డివిజన్ అధికారులకు పంపించాలన్నారు. విజేతలకు 23న నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

పంపించాల్సిన చిరునామాలు..

సబ్ డివిజన్ల వారీగా వీడియోలను గుంటూరు తూర్పు సబ్ డివిజన్‌లోని వారు sdpoeast@gmail .com, 9030101090, గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్‌లో వారు sdpowest@-gmail.com, 8688831330, తెనాలి సబ్ డివిజన్‌లో తెనాలి-1, 2, 3, తెనాలి రూరల్, పొన్నూరు టౌన్, పొన్నూరు రూరల్, చేబ్రోలు పీఎస్‌ల పరిధిలో వారు sdpotnl@g-mail.com, 8328251496, తుళ్లూరు సబ్ డివిజన్‌లో తుళ్లూరు, తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం పీఎస్‌ల పరిధిలో వారు aspofficethuulru@gmail.com, 8555941045, గుంటూరు ఉత్తర సబ్ డివిజన్ పరిధిలోని మంగళగిరి రూరల్, మంగళగిరి టౌన్, తాడేపల్లి, దుగ్గిరాల, పెదకాకాని పీఎస్‌ల పరిధిలో వారు sdpo north@gmai com, 8688831620, గుంటూరు దక్షిణ సబ్ డివిజన్ పరిధిలో నల్లపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు పీఎస్‌ల పరిధిలో వారు shovckur@ gmail.com, 8688831613కు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి దీక్ష, జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), ఎస్‌బీ డీఎస్పీ బి.సీతారామయ్య, ఎస్‌బీ సీఐలు శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా టీటీ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కాకినాడలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్న రాష్ట్ర టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు గర్తపురి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నడింపల్లి వెంకట గురుదత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వివిధ వయస్సుల వారికి నిర్వహించిన పోటీల్లో ప్రతిభకనబరచిన వారిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. జట్లకు మేనేజర్‌గా కేఎస్ఎస్ఎన్ రాజు, కోచ్‌గా సరేంద్రలు వ్యవహరిస్తారని వెల్లడించారు.

ఎంపికైన వారి వివరాలు

పురుషులు– పి.తులసీరామ్, వై.ప్రభుసాయి, కె.రాజేష్, పి.యశ్వంత్ సాయి, పి.రఫీ **మహిళలు–** పి.హాసిని, కె.సుదీక్షిత, రఫీ మున్నిసా, రుష్మా ఫెర్నోష్ ఫిర్దోస్, మోక్షిత్ రెడ్డి **బాలురు–** యశ్వంత్ సాయి, కృష్ణ మనోహర్, రుత్విక్, సమన్మయ్, దుర్గా నాగ వెంకట్ **బాలికలు–** శాన్వి సుధాకర్, ఎస్కే షరీషా, సీహెచ్ యోగితా కృష్ణ, కె.సంజన

బైక్ అదుపుతప్పి పడి యువకుడి మృతి

కర్లపాలెం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ఓ యువకుడికి తీవ్రగాయాలై మృతి చెందిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎ.రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం... కర్లపాలెం మండలం కొత్త నందాయపాలెం గ్రామానికి చెందిన శవనం చందు గోపిరెడ్డి(22) సోమవారం ద్విచక్రవాహనంపై తన స్నేహితుడిని తెల్లవారుజామున పేరలి గ్రామంలో దించి తిరిగి కర్లపాలెం వస్తుండగా పెదగొల్లపాలెం అడ్డరోడ్డు దాటిన తరువాత ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో చందుగోపిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి బాలకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొప్పరపాడు విద్యార్థి ఎంపిక

బల్లికురవ: జిల్లాస్థాయిలో జరిగిన కౌశల్ 2024 క్విజ్‌పోటీ పరీక్షల్లో కొప్పరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి బత్తుల అభిరామ్, మొదటి ర్యాంకు సాధించనట్లు హెచ్ఎం పీ.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ నెల 6న ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఈ పరీక్షకు పదో తరగతి విభాగంలో అభిరామ్ మొదటి ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఈ నెల 29, 30 తేదీలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అభిరామ్ ఎంపికైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అర్చకుడు మృతి

అద్దంకి రూరల్: రోడ్డు ప్రమాదంలో శింగరకొండ దేవస్థాన రిటైర్డు అర్చకుడు మృతి చెందిన ఘటన సోమవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై ఖాదర్‌బాషా వివరాల మేరకు.. శింగరకొండకు చెందిన కోట శ్రీరామచంద్రమూర్తి (72) ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ఆంజనేయ దేవస్థానంలో అర్చకుడిగా పనిచేసి ఉద్యోగవిరమణ చేశాడు. ఈనేపథ్యంలో సోమవారం పని నిమిత్తం అద్దంకికి స్కూటర్ మీద వచ్చి వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక పోతురాజు గండి సమీపంలోకి రాగానే లారీ ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శ్రీరామమూర్తికి రామకృష్ణ, కిషోర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు కూడా దేవస్థానంలో అర్చకులుగా పనిచేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం పోలీసులు లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా క్యారమ్స్ జట్ల ఎంపిక



కనపర్రులో క్రీడాకారులతో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

నాదెండ్ల: కనపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్14, 17 విభాగాల్లో క్యారమ్స్ బాలుర, బాలికల జట్ల ఎంపిక జరిగింది. ఈ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియకు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఐవీ మోహన్‌రెడ్డి పర్యవేక్షించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ, ఎంపికైన క్రీడాకారులు త్వరలో ప్రకాశం జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 క్యారమ్స్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను ఇన్‌చార్జి హెచ్ఎం రాజశేఖర్, అబ్జర్వర్ స్వర్ణరాజు, సెలక్షన్ కమిటీ మెంబర్ ఖాదర్‌మస్తాన్, కేవీ నాగరాజు, ఏఎంజీ నాగరాజు, చినరామయ్య, ఎంవీ సుబ్బారావు, ఖాశింబుడే, ఇస్మాయిల్, భాగ్యలక్ష్మి, సైదులు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

అండర్ 14 బాలుర క్యాటగిరీలో భాస్కర్‌నాయక్, ప్రశాంత్‌కుమార్, శశిధర్, రాణా, జయపాల్, హనుమానాయక్, స్మిత, అండర్ 17 బాలుర విభాగంలో వెంకటదుర్గాసాయి, స్టీఫెన్‌పాల్, లోకేష్ ఉన్నారు. అండర్ 14 బాలికల జట్టులో వైష్ణవి, హేమశ్రీ, పావని, ఐశ్వర్య, అమూల్యబ్లెస్సీ, అమూల్య, అండర్ 17 బాలికల జట్టులో సరళాబాయి, శరణ్య, నీలిమ, మౌనిక, రష్మిక, వెంకటపావని ఎంపికయ్యారు.

ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ



ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ రికార్డు పరిశీలించిన జిల్లా సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు.

వేమూరు: ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు మద్యం షాపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించాలని బాపట్ల జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు అన్నారు. వేమూరులోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 12 మద్యం షాపులు నిర్వహిస్తున్నారని, మద్యం షాపులపై ప్రత్యేక నిఘా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందని, బెల్టు షాపుల గురించి మా దృష్టికి వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.